# విరిగిన మనస్సులు

పెళ్లి ముహూర్తాలున్న రోజుల్లోనూ, స్కూలు పుస్తకాలు అచ్చు వేసే రోజుల్లోనూ, ప్రెస్సుకి తీరిక వుండదు. ఆ రోజుల్లో రాత్రింబగళ్ళు పనిచేస్తారు. ఆ రోజుల్లోనే ప్రెస్సుకి నాలుగు డబ్బులు మిగిలేది.

ఆ సంవత్సరం రెండూ కలిసిరావడంవల్ల అప్పటిదాకా తాటికాయి నెత్తిమీద ఎప్పుడు పడుతుందా అని మూలుగుతూ కూర్చున్న శారదా ప్రెస్ జమ్మున పని ప్రారంభించి రాత్రింబగళ్ళు యెడతెరిపి లేకుండా పని చేస్తూ వుంది. యంత్రాలు తమ కాళ్ళ గుదుళ్ళు తీర్చుకుంటూన్నై. పోసుకోలు కబుర్లు చెప్పేవాడి సామెతగా వుంది - వాటి మోత యెక్కువ.

ఆ ప్రెస్సులో కంపోజిటరుగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు తెల్లవార్లూ పనిచేసి, తెల్లవారి ఆరుగంటలకు ప్రెస్‌నుంచి బయటపడ్డాడు. సింహం నోటిలోనుంచి పెద్దపులి గుహలోనుంచి ఎగురుతున్న విమానంలోనుంచి బయటపడినవాడికిమల్లే ఉంది అతని వైఖరి. బయటపడినందుకు సంతోషంగానే వుంది కాని యింకా అదరు తగ్గలేదు. మనస్సే ప్రెస్సయి మోత పెడుతూవుంది. పరిచిన గుడ్డివాళ్ళ కళ్ళకు మల్లేవున్న కేసులూ ఆ కేసుల లొట్టల్లోకి అక్షరాలను వేసేటప్పుడు, కలిగే టకటక అనే ధ్వని, ట్రెడిల్ ఒక కాలితో తొక్కుతూ; చేత్తో కాగితం పెడుతూ తీస్తూఉన్న రంగయ్య- యివన్నీ కళ్ళముందు కనిపించి యింకా అతనికి ప్రెస్సులో ఉన్నట్టేఉంది. తను అక్షరాలను కంపోజ్ చేస్తున్నట్టూ. కట్టినఫారంలోనుంచి అక్షరాలను లాగి, కొత్తక్షరాలను దూరుస్తున్నట్టూ ఉంది.

"వెంకటేశ్వర్లూ!" అని పిలిచాడు, వెనకాలే వస్తున్న ఆదిశేషు. ఆదిశేషుకూడా ఆ ప్రెస్సులోనే పనిచేస్తున్నాడు. యజమానికి అతను తుంటరివాడిక్రింద లెక్క. ఎవ్వర్ని లెక్కచెయ్యడు; పైకి వచ్చి పైంకి

వెళ్ళిపోతాడు. ఎక్స్ట్రాపని పెడితే ఇష్టమైతే వొస్తాడు, లేకపోతే మాను కుంటాడు.

"వెంకటేశ్వర్లూ!"

"ఆఁ" అంటూ వెంకటేశ్వర్లు ఆగాడు.

"ఎట్లా ఉంది."

ఏది ఎట్లావుందో_అడిగిన ఆదిశేషుకీ తెలియదు. ఏది బాగుందో జవాబు చెప్పిన వెంకటేశ్వర్లుకీ తెలియదు.

"ఇంటికేనా?" అని అడిగాడు ఆదిశేషు.

నిద్రలేక, ఓపికలేక, ఊగిపోతున్న వెంకటేశ్వర్లు మళ్ళీ యింకొక సారి 'ఆ' అన్నాడు.

"మళ్ళీ తొమ్మిది గంటలకు వస్తావా?"

"వొస్తా"

ప్రెస్సుకు రాకుండా ఎట్లా ఉంటామో వెంకటేశ్వర్లుకి తెలియదు. సెలవురోజులలోకూడ వొచ్చి ప్రెస్సుకు వేసిన కప్పతాళాన్ని ఒక్కసారి చూస్తే తప్ప అతనికి తృప్తి వుండేదికాదు.

"మేనేజర్ని ఏమిటో అడుగుతున్నావు?"

"డబ్బు."

"ఎంత?"

"అయిదు రూపాయలు"

"ఇచ్చాడా?"

"బేడ యిచ్చాడు"

"ఎందుకని?"

"కాఫీ తాగమని."

"జీతంలో రాసుకుంటాడా?"

వెంకటేశ్వర్లు మాట్లాడలేదు. అతని కళ్ళు మూతలుపడుతున్నై. అలాగే నడుస్తూ వెళ్తున్నాడు.

"అడిగినంత ఎందుకు యివ్వనన్నాడు?"

"ఎడ్వాన్సులు యివ్వటం మానేశాడట."

"ఎక్స్ట్రా పనికో?"

"అంతా కలిపి నెలాఖరుకేనట."

"ఈలోగా ఏం చెయ్యాలి?"

వెంకటేశ్వర్లు మాట్లాడలేదు.

"గాడిదలు కాయాలి" అని తనకు తానే జవాబు చెప్పుకున్నాడు ఆదిశేషు.

ఇద్దరూ కలసి కాఫీ త్రాగారు. ఆదిశేషు డబ్బిచ్చాడు. కిల్లీకొని వేసుకోమని బలవంతం పెట్టాడు వొద్దనే వోపికకూడా లేక వేసుకున్నాడు వెంకటేశ్వర్లు.

ఆదిశేషు వెళ్ళిపోయిన తరువాత మేనేజరు యిచ్చిన బేడలో అర్ధణా పెట్టి బీడీలు కొనుక్కుని ఇంటికి బయల్దేరాడు వెంకటేశ్వర్లు.

వెంకటేశ్వర్లుకి యింటికి వెళ్ళటానికి భయంగావుంది. అతని భార్య వెచ్చాలకు డబ్బు తీసుకురమ్మన్నది. అణన్నరతో వెళ్తున్నాడు. ఈ ఒక్క కారణమేకాదు. ఇటీవల అప్పుతీర్చే నిమిత్తం ఆమె గొలుసు అమ్మినప్పటి నుండీ ఏదో ఒక నెపంతోటి సాధిస్తూవుంది. గొలుసు అమ్మటం అదొక పెద్ద కథ. శారదా ప్రెస్సులో జేరినప్పటినుంచీ, వెంకటేశ్వర్లుకి నెలకు ముప్పైరూపాయలు జీతం. అది చాలక ప్రతినెలా అప్పుచేస్తూ వుండేవాడు. ఆ అప్పు యీర్ష్యకుమల్లే, అజ్ఞాని కోర్కెలకుమల్లే పెరిగి పెరిగి, అయిదు వందలయింది. అప్పులవాళ్ళ బాధ ఎక్కువై కనీసం రెండు వందలన్నా మిగులుతుందనే ఆశతో ఒక నాటకం కంట్రాక్టు తీసుకొని వేయించాడు.

అందులో రెండువందలు నష్టపడ్డాడు. మర్నాటినుంచీ పాత అప్పులవాళ్లూ, కొత్త అప్పులవాళ్లూ యెగబడ్డారు. వాళ్ళ పోరు పడలేక భార్య మెడలో వున్న గొలుసు అమ్మి అప్పు తీర్చాడు వెంకటేశ్వర్లు. అప్పటినుంచీ కష్టగావుంది. ఆమె తిట్టినా, తుమ్మినా నోరు మెదల్పకుండా పెట్టింది తిని పెస్సుకి వెళ్తుండేవాడు. కాని ఎంత తప్పుకు తిరిగినా యింటికి వెళ్ళటం అంటే అతనికి బెరుగ్గానే వుంటూ వుంది. కాని యింటికి వెళ్ళక తప్పదు. భార్యను కనపడకతప్పదు. అతను అలాగే కాళ్ళు యీడ్చుకుంటూ యింటికి చేరాడు. ఇంట్లో అడుగు పెట్టీ పెట్టటంతోనే "డబ్బేది?" అని చెయ్యి జాపింది భార్య. ఆమెను చూసేటప్పటికి పేలాలూ, మంగలం, గుగ్గిలం, పొగా, ఆవకాయ ఎరుపూ, సవఖాలీ దుర్గంతాలూ జ్ఞాపకం ఒచ్చినై వెంకటేశ్వర్లుకి. ఏమీ చెప్పలేక చూస్తూ వూరుకున్నాడు.

"తే?" అన్నది భార్య.

"తేలేదు" అన్నాడు వెంకటేశ్వర్లు.

"ఎందుకనీ?"

"ఇవ్వలేదు"

"అడిగావా?"

"ఆఁ"

"నీ మొహంచూస్తే యిచ్చేవాళ్ళకూ్కడా ఇవ్వబుద్ధి అవదు" అని గిరుక్కునతిరిగి యింటిలోకి వెళ్ళింది. వెళ్ళటమే చాలు ఎందుకు వెళ్ళినాసరే.

అతను చాపమీద చతికిలబడి గోడకానుకొని, కునికిపాట్లు ప్రారంభించాడు. ఎదురుగా కిటికీ తెరచుకొనివుంది. కిటికీకి అవతలపక్క అతని కూతురు యిరుగు పొరుగు పిల్లలతో కలిసి బొమ్మల పెళ్లిళ్ళు చేస్తూ వుంది.

ఆ చుట్టుపక్కల నివాసం ఉంటూవున్నదంతా బీదవాళ్ళే. ఆ ఆవరణలో పది పన్నెండు కుటుంబాలు కాపురం వుంటున్నై. అది ఒకప్పుడు

పశువుల కొట్టం. దాన్నే భాగాలుగాచేసి అద్దెలకు యిస్తున్నాడు ఖామందు. ఆ ఆవరణలోనే యింకా అయిదారు గుడిసెలువున్నై. వెంకటేశ్వర్లు భాగానికి ఆనుకొనివున్న గుడిసెలో రాజమ్మ కాపురంవుంటూ వున్నది. ఆమె పాచిపని చేసి జీవితం పోషించుకుంటూవుంది. ఆమె కూతురూ, పక్కభాగంలోవుంటున్న రామప్పకూతురూ, వెంకటేశ్వర్లు కూతురూ కలిసి వెంకటేశ్వర్లుకి ఎదురుగావున్న కిటికీ అవతల ఆడుకుంటున్నారు. వెంకటేశ్వర్లు కునికిపాట్లు పడుతూ వాళ్ళని చూడలేదు.

ఆ పిల్లలు ఆడుకుంటున్నారు. మధ్యలో రామప్పకూతురు ఏడుస్తూ వెళ్ళిపోయింది. కొంచెంసేపటికి రామప్ప భార్య కూతుర్ని వెనకేసుకుని వచ్చింది. ఆమె కూతురు యింకా ఏడుస్తూనేవుంది.

"ఎవరే మా అమ్మాయిని కొట్టింది?" అడిగింది రామప్ప భార్య.

"మేం ఎరగం" అన్నది రాజమ్మ కూతురు.

"ఎరగండే ఎందుకట్లా ఏడుస్తుంది?...."

"నిజం చెపుతారా చంపలు వాయించమంటారా?"

"మేం ఎరగం"

"నిన్నెవరే కొట్టింది. చెప్పు?" ఈసారి కూతుర్ని అడిగింది.

కూతురు రాజమ్మ కూతుర్ని చూపింది.

"ఒంట్రిదాన్నిచేసి, నీ బతుక్కాతోడు........" అని రాజమ్మ కూతుర్ని కొట్టబోయింది రామప్ప భార్య.

"నేను యెరగను. అమ్మతోడు" అన్నది రాజమ్మ కూతురు.

"నువ్వు నిజం చెప్పవే" అని వెంకటేశ్వర్లు కూతుర్ని అడిగింది రామప్ప భార్య.

"కొట్లా పిన్నీ—" అని మొదలుపెట్టింది వెంకటేశ్వర్లు కూతురు.

"కొట్లా?" అని గుడ్లురుమింది రామప్ప భార్య.

వెంకటేశ్వర్లు కూతురు భయపడి, "మరే— మీ అమ్మాయి బొమ్మమీద ఈ పిల్ల వుూసింది" అని చెప్పింది.

"ఓసి ముండా! నాలుగిళ్ళలో ఎంగిలి మెతుకులు తినేదానికి నీ కెంత బలిసిందే ఒళ్ళు! నా బిడ్డ బొమ్మ తెచ్చుకుంటే ఊస్తావటే నీ బతుక్కి--దాన్ని బతుక్కి--" అని కొట్టింది.

ఆ పిల్ల గావురుమని యేడ్చింది.

పిల్లదాన్ని కొట్టడానికి అసలు కారణం వేరు. తన మొగుడు రాజమ్మ యింటికి రాత్రిళ్ళు వొచ్చిపోతున్నాడనీ, ఆ పిల్లకి చిరుతిండికి కాను లిస్తున్నాడనీ ఆమె విన్నది. విన్నప్పటినుంచీ ఆమె వొళ్ళు కాలుకు పోతూ వుంది. ఆ కసి పిల్ల దానిమీదుగా తీర్చుకుంది రామప్ప భార్య.

పిల్లదాని ఏడుపులు విని గుడిసెలోనుంచి రంయిన పరిగెత్తుకొని వచ్చింది రాజమ్మ. జయ్యిన వేసుకొంది లడాయి. ఇద్దరూ బాగా బూతులు తిట్టుకుంటూ జుట్లుజుట్లు పట్టుకుని నేలమీద పొర్లుతున్నారు. పిల్లలు యిల్లు యెగిరిపోయేటట్టు యేడుస్తున్నారు. కునుకుతున్న వెంకటేశ్వర్లు గోలకి కళ్ళు తెరచి బయటకు వొచ్చి వాళ్ళను విడిపించాడు. వాళ్ళు పట్టు విడిచారేగాని పోట్లాట మానుకోలేదు.

"ఊళ్ళో వాళ్ళ మొగుళ్ళని మరిగి—" అన్నది రామప్పభార్య రొప్పుకుంటూ.

"పాత చెప్పుతో కొట్టిస్తా" అని నోటికి వచ్చినట్లు కూసింది రాజమ్మ.

"ఆయన్ని రానియ్; నీ వొళ్ళు తాట ఒలిపించకపోతే నన్ను మారుపేరున పిలువు" అన్నది రామప్ప భార్య.

"నువ్వు వొలిపించినవాళ్ళే కామాలు కాలవగట్టునపడి ఏడుస్తున్నారు" అన్నది రాజమ్మ.

"ఊరుకో రాజమ్మా" అన్నాడు వెంకటేశ్వర్లు.

"అదికాదు అన్నయ్యా, ఆటలో పిల్లలు కొట్టుకుంటారు, తిట్టుకుంటారు. దాని కిది ఒచ్చి నా బిడ్డని దడదడా కొడుతుందా?" అని అడిగింది రాజమ్మ

"పిల్లలమీద చెయ్యిచేసుకోవటం తప్పే" అన్నాడు వెంకటేశ్వర్లు ఆవులిస్తూ- తను ఆలోచించి అనలేదు. ఏదో ఒక విధంగా సర్దుబాటు చేద్దాం అనే వుద్దేశంతో అనేశాడు.

ఈ మాటకు రామప్ప భార్యకు ఎక్కడలేని కోపం వొచ్చింది. "పెళ్ళానికి జవాబు చెప్పలేని మొగాడివి తీర్పు చెప్పొచ్చావా, తీర్పు?" అన్నది.

ఈమాట అంటూవుండగానే పక్క యింటికి బియ్యం కోసం వెళ్ళిన వెంకటేశ్వర్లు భార్య వొచ్చింది. ఆమెని చూసేటప్పటికే రామప్పభార్య భయపడి పిల్లని రెక్కపట్టుకొని వెళ్ళిపోతూ వుంది.

ఆమె భయపడటానికి కారణం వుంది. మొదట్లో రామప్ప భార్యా వెంకటేశ్వర్లు భార్యా చాలా స్నేహంగా వుండేవాళ్లు; అక్కచెల్లెళ్ళలాగా, వుండేవారు. ఆ రోజుల్లో రామప్ప భార్య వెంకటేశ్వర్లు భార్యకు ఒక రహస్యం చెప్పింది. తరువాత యిద్దరికీ చెడింది. చెడటానికూడా పెద్ద కారణం లేదు. రామప్ప భార్య కొంచెం పొదుపుగా కాపురం గడిపే మనిషి. మిరపకాయలనీ, చింతపండనీ అందరిదగ్గరా ఏదో ఒకటిపుచ్చుకుంటూనే వుంటుందేగాని తానుమాత్రం ఏమీ జారనివ్వదు.

ఒకరోజు వెంకటేశ్వర్లు భార్య పులుసులోకి కాస్త చింతపండు పెట్టమని అడిగితే 'లేదు' అంది. ఒకరోజు కూరలోకి తక్కువని ఉప్పు కళ్లు అడిగితే 'లేదు' అంది. ఒకరోజు రెండు కరివేపమండలు అడిగితే 'లేదు' అని "ఎందుకు మాటి మాటికీ అడిగి నాతో లేదు అనిపించుకోవటం" అన్నది.

ఆనాటినుండీ పగపట్టింది వెంకటేశ్వర్లు భార్య. ఆ సంగతి రామప్ప భార్యకి తెలుసు. అప్పటినుంచీ తన రహస్యం ఎక్కడ బయట పెడుతుందో అని భయంగా వుంటూవుంది.

వెంకటేశ్వర్లు భార్యకూడా కసితీర్చుకోటానికి అవకాశం కోసం ఎదురు చూస్తూ వుంది. ఇదే మంచి అవకాశం అనుకుంది.

"ఏమిటే నువ్వు యిప్పుడన్నమాటా!" అని ఉరిమింది.

రామప్ప భార్య నిలబడకుండా వెళ్ళిపోతూ వుంది.

"ఆగవే?" అన్నది.

ఆగింది.

"చెప్పవే?"

చెప్పలేదు.

"భగవంతుడు నోరు ఒక్కటి ఎట్లాగూ పెట్టాడని ఇష్టం వచ్చినట్టు వాగుతున్నావా? నీ బతుక్కి తోడు మాకు నీతులు చెప్పొచ్చావా?" అని మొదలు పెట్టింది వెంకటేశ్వర్లు భార్య. రామప్ప భార్య తప్పుకుందామనుకుంది గాని వీల్లేకపోయింది. కప్ప వెంట పాముకుమల్లే పడింది. ఎలుకతో పిల్లికిమల్లే చెర్లాడింది. కుక్క గుడ్లపీలికలతో ఆడుకున్నట్లుంది. కారు మబ్బులకుమల్లే కన్పించింది. చివరకి ఆ ముత్యం అంతమాటకూడా అనేసింది.

"నీమొగుడికే సిగ్గుంటే పెళ్ళికాకముందే మేనల్లుడితో కార్య కలాపం జరిపిన విన్నెట్లా చేసుకున్నాడే. చిన్నప్పటి నుంచీ యిట్లాంటి పనులుచేసి ఎగ్గూ సిగ్గూలేని దానివి గనుక యింకా బతుకుతున్నావు. ఎందులోనన్నా పడి చావరాదటే దరిద్రం వొదులుతుంది." అన్నది వెంకటేశ్వర్లు భార్య.

ఇదే రామప్ప భార్య వెంకటేశ్వర్లు భార్యకి చెప్పిన రహస్యం. ఇది బయటపెడుతుందేమో అని రామప్ప భార్య యిన్నాళ్ళూ భయపడింది. ఎలాగూ అనేసింది. ఇక భయపడవలసిన పనిలేదు ఇన్నాళ్ళనుంచీ అపుకు వుందేమో ఉద్రేకాన్ని, బయ్యన తోకతొక్కిన పాములాగే లేచింది. పమిటె బొడ్లో దోపింది. తెగించింది. 'మొగుణ్ణి ముండను చేసి కూర్చోపెట్టి యిష్టంవచ్చినట్టు ఆడుతున్నావు' అన్నది. 'నీ సంగతి ఈ వాడకట్టు అందరికీ తెలుసు' అన్నది. 'మొగుణ్ణి ఆఫీసుకి పంపి రత్తమ్మ కొడుకుని పెట్టుకు కులకటం అంతా చూస్తూనే వున్నారు' అన్నది 'ఇల్లె వరు గడుపుతున్నారో, మొన్న జాకెట్ గడ్డ కొని ఇచ్చింది ఎవ్వరో తెలియ దనుకున్నావా' అని ప్రశ్నించింది. 'అంతా నీలాంటివాళ్ళే అను కుంటావు; నీ సంగతి మొగుడికి తెలుస్తుందేమో అని, ముందే అందరికీ అంటగడుతున్నావు' అన్నది.

వెంకటేశ్వర్లు అక్కడే వున్నాడు. రామప్ప భార్య మోపుతున్న నిందలన్నీ విన్నాడు. కాని అతనికేమీ కష్టం కలగలేదు. ఆ వాడకట్టులో ఏ కొద్ది పోట్లాట జరిగినా యిటువంటి నింద మోపటం ఆడవాళ్ళకి అల వాటే. కదిలిస్తే వాళ్ళ నోటివెంట వొచ్చే మాటలే యివి. అంతకుముందు యెంత బాగా వుంటున్నా ఏ రకంగానూ అనుమానించటానికి వీల్లేని మనిషైనా కజ్జారాగానే పుటికి పుటిక్కిన రంకుల్ని అంటగట్టడం వాళ్ళకు ఆచారం. అందులో వర్ణించి వర్ణించి తిడతారు ఆ వైఖరి చూస్తే ఆ విధంగా తిట్టటంలో వాళ్ళకు విచిత్రమైన ఆనందం కలుగుతూవున్నట్లు కనిపిస్తుంది వాళ్ళల్లో తీరని కోర్కెలను వేటినో ఆ తిట్లు తీరుస్తూవుంటై. అవ్యక్తంగా వున్న అపేక్షలను నోటిద్వారా తీర్చుకుంటున్నారు అనిపిస్తుంది.

వెంకటేశ్వర్లు సంగతి ఎలావున్నా అతని భార్యమాత్రం రామప్ప భార్య తిట్లు విని నిశ్చేష్టితురాలైంది. ఆమె యీ విధంగా ఎదురు తిరుగు తుందనీ, చివరకి తనే వోడిపోవలసి వస్తుందనీ యెన్నడూ అనుకోలేదు. తన దగ్గరవున్న బాణం విడిచిపెట్టగానే ఆమె శరీరం తూట్లు పడుతుంది అనుకుంది. మొహం వేలాడ వేసుకుని యింట్లోకి వెళ్ళి ఏడుస్తూ పడుకుం

టుంది అనుకుంది. ఎవరు తిరిగి తనమీద నిందలను కురిపిస్తుందనుకో లేదు ఆ నింద సత్యాన్ని అసత్యంగా మార్చి వృద్ధి చెందుతుందనుకోలేదు. ఇన్నాళ్ళనుంచీ పదును పెట్టుకుంటూ కూర్చున్న రహస్యం విఫలం అవటమేకాక అపనిందగామారి తన నెత్తినే చుట్టుకునేటప్పటికి ఆమె కొయ్యబారిపోయింది. మరొక విషయం కూడా ఆమెను చకితురాలను చేసింది. రామప్పభార్య తనమీద మోపింది అపనింద తను రామప్ప భార్యను గురించి అన్నమాటమాత్రం యదార్థం కాని యేం లాభం! ఈ భేదంవల్ల వచ్చిన ప్రయోజనం ఏముంది? ఎవరు నమ్మేది వారు నమ్ముతారు జరగడానికి వీల్లేనిచోట జరిగిందంటేనూ, చెయ్యాని వారు చేశారంటేనూ బాగా నమ్మబుద్ధి అవుతుంది. కాబట్టి ప్రపంచంలో సత్యానికంటే అసత్యానికే ఎక్కువ బలం వుంది. మంచికంటే చెడుకే యెక్కువ బలం వుంది.

తన్ను జయించింది రామప్ప భార్య. అపజయాన్ని ఓర్వలేకపోయింది వెంకటేశ్వర్లు భార్య ఇక అసలు విషయం విడిచిపెట్టి "నా స్థలంలో ఎవరు అడుగుపెట్టమన్నారు" అని పోట్లాడింది "పిల్లల్ని అదుపులో పెట్టుకోవటం చాతగానిదానివి ఎందుకన్నావే" అని అడిగింది రామప్ప భార్య తగ్గలేదు. నోటికి వచ్చిన తిట్లన్నీ తిట్టి కూతుర్ని తీసుకొని యింటిలోకి వెళ్లింది. వెళ్తూ వెళ్తూ 'గొడ్డుమోతు' అని తిట్టింది.

ఈ మాటకు వెంకటేశ్వర్లుభార్య ఒళ్ళు ఝల్లుమన్నది. అంతవరకూ ఆమె అన్నమాటలన్నీ ఒక యెత్తూ, ఈ మాట ఒక ఎత్తూ. తనకు అయిదు సంవత్సరాల క్రిందట ఒక కూతురు కలిగింది. మళ్ళీ పిల్లలు లేరు. తనకు కొడుకు కలగాలని చాలా అపేక్ష. పోనీ ఏం చెప్తాడో చూద్దామని తనూ భర్తా డాక్టర్‌కి చూపించారు. డాక్టర్ ఏమన్నాడు? తలుచుకుంటే గుండె గుభేలుమంటుంది. తన ఆరోగ్యం సరిగానే వుందనీ తన భర్త ప్రెస్సుపని మానుకుంటేగాని పిల్లలు కలగరనీ చెప్పాడు. కలిగినా బ్రతకరన్నాడు. ఈ సంగతి చుట్టుపక్కల వాళ్ళందరికీ తెలుసు. ఆ పుండు కెలుకుతూవుంది రామప్ప భార్య

వెంకటేశ్వర్లు భార్యకు కంపరం పుట్టింది. "దరిద్రపుగొట్టు వాళ్ళందర్నీ పోగుజేస్తావు" అని కూతుర్ని నిర్దాక్షిణ్యంగా కొట్టింది. ఆ పిల్ల ఏడుపు వినలేక, "ఊరుకోవే" అన్నాడు వెంకటేశ్వర్లు. రేగింది వెంకటేశ్వర్లు భార్య.

"నీకు నిజంగా మగతనం వుంటే అది అట్లా అనగలుగుతుందీ? పెళ్ళాన్ని యిట్లా తిడుతుంటే యింకొకడు మొగాడైతే చూస్తూ వూరుకుంటాడా! నీకు చీమూ నెత్తురూ లేదు ఈ బ్రతుకు బ్రతికేదానికన్నా ఎందులోనన్నా పడి చావరాదూ? ఒక్క ఏడుపు ఏడ్చి ఊరుకుంటాం! అంది.

"ముందు నువ్వే అంటివిగా!" అన్నాడు వెంకటేశ్వర్లు ఇక ఆగలేకపోయింది వెంకటేశ్వర్లు భార్య. తనమాటలూ, దానిమాటలూ ఒకే రకంగా వున్నాయి అతనికి. మాటలు వెనుకవున్న చరిత్ర అతనికి అర్థం కాలేదు. నోరు నొప్పి పుట్టేదాకా భర్తని తిట్టితిట్టి "నీ మొహానికి ఇక అన్నం వండను. ఎక్కడికిచస్తావో చావు. పో" అనిచెప్పి ఇంటిలోకి వెళ్ళింది. అదే చాలు.

వెంకటేశ్వర్లు కూతుర్ని కూచోబెట్టుకుని మళ్ళీ చాపమీద చతికిలపడ్డాడు జరిగిన సంగతులు అతని మనస్సుకి పటినట్టులేదు. గోడకానుకుని మళ్ళీ కునికిపాట్లుపడటం మొదలుపెట్టాడు ఆఫీసువేళకి మెలకువవొచ్చింది. భార్య అన్నం వండుతూవుందో, అసలు ఏం చేస్తూవుందో తెలుసుకోకుండానే బయలుదేరాడు కళ్ళు నులుముకుంటూ బయటకు వెళ్ళాడు. వూగిన లాగుతు బయలుదేరాడు

దారిద్ర్యం అనేక అనర్థకాలకు పుట్టినిల్లు. అసుర ప్రవృత్తికి ఆకరం. మనస్సుని చిందరవందరచేసి మానవునిలో వున్న నీచత్వాన్ని బయలుపరచివేస్తుంది. జ్ఞానం కలిగితే దృష్టి మారుతుందనీ, విశాలమైన భావాలు కలిగి జీవితం బాగుపడుతుందనీ కొందరు చెపుతారు. కాని గర్భదరిద్రులకు జ్ఞానంకలిగేది ఎలా? వాళ్ళకు యిరవైనాలుగుగంటలూ చెయ్యి ఆడితేనేగాని డొక్క ఆడదు. ఊహ ఒచ్చిందగ్గరనుంచీ ఏదో ఒకపనిచేసి

సంపాదించవలసిందే ఎంత కష్టపడి సంపాదించినా ఏ రోజుకి ఆరోజు గడవటమే గగనమౌతుంది. ఏరోజు పనిలోకి వెళ్ళకపోతే ఆరోజు పస్తే. చదువుకోటానికిగాని, చదువుకున్నవాళ్ల సాంగత్యం చెయ్యటానికిగాని వాళ్లకు అవకాశం ఉండదు; తీరిక ఉండదు.

వాళ్ల జీవితాలు ఈర్ష్యా అసూయలతో పెనవేసుకొనిపోయి ఒక పట్టున ఆ సంకెళ్లను ఒదిలించుకోలేవు. వెంకటేశ్వర్లు భార్యతోపాటు ఆవరణలోవున్న వాళ్ళందరి జీవితాలూ ఇటువంటివే. ఒకరంటే ఒకరికి గిట్టదు. ఒకరిమంచి ఒకరు సహించలేరు. తమ బాగుకంటే యెదటివాళ్ల నాశనాన్ని ఎక్కువ కోరుతుంటారు. అస్తమానం ఒకరిమీద ఒకరు కొండాలు చెప్పుకొనటం, ఏ కొంచెం పొరపొచ్చెం జరిగినా బజారుకెక్కటం జరుగుతూ వుంటుంది. ఆ వాతావరణం బూతులగుట్ట; ద్వేషపు పుట్ట ఇటువంటి వాతావరణంలో భాగంగా వుంటున్న వెంకటేశ్వర్లు భార్య తనకు జరిగిన అవమానం దిగమింగి వూరుకుంటుందనేమాట వొట్టిమాట.

ఆమెకు తపనపుట్టింది. ఇంటిలోనుంచి వెళ్లిపోదామనిపించింది. ఎక్కడకు వెళ్ళుతుంది? ఆమెకి కన్నవారులేరు. గంగలో కలిసిపోయారు. ఏదో ఒకపని చెయ్యాలి లేకపోతే గుండె పగిలిపొయ్యేట్టు వుంది. తలుపులు బలవంతంగా తెరిచింది గబాలున మూసింది? ఇల్లంతా ఊడ్చింది. యింటి చుట్టూ చిమ్మింది. పొయ్యరాజేసింది ఎసరుపెట్టింది. కూతుర్ని కొట్టింది. సముదాయించింది అన్ని చేసినా ఆమె ఆరాటం తగ్గలేదు రావప్ప భార్యకు తగినశాస్తి చెయ్యాలని నిశ్చయించుకొని రాజమ్మ ఇంటికి వెళ్ళింది. రాజమ్మను రెచ్చగొట్టింది.

“మూశవంటే దాని మదం” అంది.

రాజమ్మ మాట్లాడలేదు.

“నన్నన్న వానికి నాకేం లేదే. మొగుడితో చెప్పి నీ ఎముకలు విరగ్గొట్టిస్తుందట పంచాయితీ పెట్టిస్తుందట నిన్ను యిక్కడ లేకుండా చేస్తుందట ఈ ఊళ్ళో అన్నం, నీళ్ళు పుట్టకుండా చేస్తాదట....”

ఈ విధంగా కల్లబొల్లి కబుర్లు నూరిపోసి బాగా రోషం వచ్చేటట్టు చేసింది రాజమ్మకి. 'రామప్పని కట్టుకో' అని సలహా చెప్పింది. చీకటి పడగానే రామప్ప రాజమ్మ యింటికి వచ్చాడు. రామప్పకి కోడిమాంసం అంటే యిష్టం. రాజమ్మ వండితే తినాలి అంటాడు. రాజమ్మకి ఈ సంగతి తెలుసు. ఆ రాత్రి కోడిమాంసం వొండిపెట్టి, వున్నవీ లేనివీ కల్పించి అతని భార్య మీద చెప్పింది.

"ఇక్కడకు రావటం మానుకోకపోతే నన్ను యింటిలో నుంచి గెంటిస్తుందట" అని చెప్పింది అమెకూ మేలుడికీ చిన్నప్పటినుంచీ వున్న సంబంధం చెప్పింది. "వూరంతా ఒకటేగోల. నీకు తెలిసే వూరు కున్నావట!" అని అడిగింది.

రామప్ప ఉడికిపోయాడు, గబగబా యింటికివెళ్ళి, భార్యని దబదబా బాదాడు. ఆమె కేకలువిని చుట్టుపక్కల వాళ్ళు అంతా పోగయ్యారు పెద్ద వాళ్ళు కేకలు వేశారు. 'ఇది తగదు రామప్పా' అన్నారు.

"నా పెళ్ళాం; మీకేం సంబంధం? ఇక్కడనుంచి వెళ్ళండి" అని గద్దించాడు రామప్ప. వాళ్ళ కళ్ళయెదుట మళ్ళీ కొట్టాడు భార్యని.

ఇరుగు పొరుగువాళ్ళు రామప్పదే తప్పు అని చెప్పుకుంటూ వుంటే రామప్ప పెళ్ళాందే తప్పని పోట్లాడింది వెంకటేశ్వర్లు భార్య.

"ఎన్నాళ్ళని వూరుకుంటాడే? చిన్నతనంలో యేదో చేసిందిలే అని వూరుకుంటే చాటుగా,మాటుగా యిప్పటికీ పిలిపిస్తూనేవుంటే" అని చెప్పింది.

"ఓసెమ్మా? అంతటిదటే, ఏదో నంగనాచికిమల్లే వుండేది" అని ముక్కుమీద వేలు వేసుకున్నారు అంతా.

"ఒక్కనాడన్నా రామప్పకి కడుపునిండా అన్నం పెడుతుందటే! అన్నానికి వాచి వాచి. చాటుగా రాజమ్మతో మాంసంకూర చేయించు కుంటాడు. అది గిట్టకపోయే దానికి" అని చెప్పింది.

"ఏదేం రోగమే, మొగకొడుక్కి అన్నం పెట్టటానికేమే. పోయేటప్పుడు కట్టుకుపోతుందా ఏమిటి?" అన్నారు అత్తా.

"డబ్బులు మిగిల్చి మేనల్లుడికిస్తుందే" అని చెప్పింది.

ఓసి దీని అమ్మా కడుపుకాలా! అని తలోకమాటా అన్నారు రామప్ప భార్యని. వెంకటేశ్వర్లు భార్యకి అప్పుడు కడుపుమంట చల్లారింది.

ఆ రోజు వెంకటేశ్వర్లు ఇంటివద్దరనుంచి ఆఫీసుకి వెళ్ళేటప్పటికి కొంచెం ఆలస్యం అయింది. ప్రెస్ ఆఫీసు అంతా గందరగోళంగా వుంది గడపలో ఆదిశేషు కనిపించి, "రంగయ్య ట్రెడిల్లో చెయ్యిపెట్టి నలగ్గొట్టుకున్నాడు" అని చెప్పాడు.

అంతా కలిసి రంగయ్యని హాస్పిటల్‌కు చేర్చారు. డాక్టర్ పరీక్ష చేసి ప్రాణాపాయం లేదనీ, మోచెయ్యి తీసివేయవలసి వొస్తుందనీ యిక ఏ పనికీ రాడనీ చెప్పారు. రంగయ్య చిన్నప్పటినుంచీ ప్రెస్సు పనే చేస్తున్నాడు. పదిహేను సంవత్సరాలనుంచీ ట్రెడిల్ వేస్తున్నాడు. ఇంకొక పని అతనికి చేతకాదు. పైగా అతనికి ముగ్గురు పిల్లలు. చిట్టి ముత్యాల వంటి ఆ పిల్లలనీ. అతని భార్యనీ చూస్తే అందరికీ కన్నీరు కారింది. వాళ్ళకు సహాయం చెయ్యవలసిందని అడగటానిగ్గాను ప్రెస్సు పనివాళ్ళంతా వాళ్ళని వెంటబెట్టుకొని యజమాని ఇంటికి వెళ్ళారు. ఆ ప్రెస్సు యజమానికి యిదొక్కటే వ్యాపారం కాదు. అనేక వ్యాపారాలున్నాయి. ఆ ఊళ్లో ఒక సినిమాహాలు నడుపుతున్నాడు. ఒక కాఫీహోటలు నడుపుతున్నాడు. స్థలాలుకొని అమ్ముతుంటాడు. అతను చెయ్యని చిల్లర వ్యాపారంలేదు.

అతనుచేసే అనేక వ్యాపారాల్లో ఈ ప్రెస్సువ్యాపారం ఒకటి ప్రెస్సులో తనకేమీ లాభంలేదనీ, పనివాళ్ళ పొట్టమీద కొటలేక సాగిస్తున్నాననీ చెపుతుంటాడు ఎవ్వరైనా జీతం హెచ్చించమనిగానీ, ఇంటిలో ఇబ్బందిగావుంది ఏదన్నా అప్పు అడిగితేగానీ తనకు 'ప్రెస్' చాలా

నష్టం వొస్తూ వుందనీ, తమకోసం ఇంతనష్టానికీ వొప్పుకుని సాగిస్తున్నా విశ్వాసం లేకుండా ప్రవర్తిస్తున్నారనీ, అందుకని ప్రెస్సుమూసి వేస్తాననీ బెదిరిస్తూఉంటాడు.

పనివాళ్ళు వెళ్ళేటప్పటికి అతను భోజనం చేస్తున్నాడు. పనివాళ్ళు హాల్లో నిలబడ్డారు. అతను భోజనం చేసివచ్చి ఒక్కసారి అందర్నీ క్రీగంట చూచి, "ఏమిటి!" అని అడిగాడు. ఆదిశేషు జరిగిందంతా చెప్పి రంగయ్య పెళ్లాన్ని-పిల్లలనూ చూపి సహాయం చెయ్యవలసిందని ప్రార్థించాడు.

"నావల్లకాదు" అన్నాడు యజమాని.

"ఇరవై ఏళ్ళనుంచీ మీ ప్రెస్సులో పనిచేస్తున్నాడు" అన్నాడు ఆదిశేషు.

"ఇరవై ఏళ్ళనుంచీ జీతం యిస్తున్నాను." అన్నాడు యజమాని.

"ముంజెయ్యి తీసివెయ్యాలన్నాడు డాక్టరు" అని చెప్పాడు ఆదిశేషు.

"అతన్ని యెవరు అజాగ్రత్తగా వుండమన్నారు?" అని అడిగాడు యజమాని.

"నాలుగు రోజుల్నుంచి వరసగా రాత్రింబగళ్ళు పనిచేస్తున్నాం. పనిచేస్తుంటే నిద్రచాలక కళ్ళు తిరిగినై" అని మొదలుపెట్టాడు ఆదిశేషు.

"రాత్రింబగళ్ళు పని చేస్తున్నాం అంటే పనిచేసి నందుకు డబ్బు యిస్తూనే వున్నాగా!" అన్నాడు యజమాని.

"ఇస్తున్నారనుకోండి....కాని .. "

"ఎక్స్ట్రాపనికి రమ్మని నేను యెవర్నీ బలవంత పెట్టలేదు యిష్టం అయినవాళ్ళనే రమ్మన్నాను." అన్నాడు యజమాని.

"అవుననుకోండి....కాని....మీ పనిలోనే ఉంటూ మీ పనిలోనే అపాయం కలిగినవాడికి మీరు సహాయం చెయ్యకపోతే యింకెవరు సహాయం చేస్తారు చెప్పండి?" అన్నాడు ఆదిశేషు.

"ఇంతవరకూ లాభాలున్నా లేకపోయినా మీరంతా ఏదో బతుకుతున్నారుగదా అని యీ ప్రెస్సు నడుపుతున్నాను. ఇంకా యిలాంటి నష్టాలుకూడా నేను పెట్టలేను" అన్నాడు యజమాని.

"ఆ మాత్రం సాయం చేసేది లేకపోతే మేం ఇక్కడ పని చెయ్యటం కష్టం" అన్నాడు ఆదిశేషు.

"కష్టమయితే మానుకోండి....నేనే ప్రెస్సు అమ్మేద్దామనుకుంటున్నాను" అంటూ లోపలికి వెళ్లడానికి లేచాడు యజమాని.

"అంతేనంటావా?" అని గట్టిగా అడిగాడు ఆదిశేషు.

"అంతే....నాదొక్కటేమాట" అంటూ వెళ్ళాడు యజమాని. వచ్చినవాళ్ల దరూ తలలు దించుకున్నారు. అందరూ తోటకూర కాడల్లా వంగిపోతున్నారు.

"ఇది అన్యాయం. మన బతుకులన్నీ యీ ప్రెస్సు పనిలోనే హరించుకుపోయినా యజమాని అభిమానంచూపకపోవడం సహించలేం.... మనం సమ్మె చేద్దాం." అన్నాడు ఆదిశేషు.

ఎవరో ఓ మూలనుంచి "మరి తిండో .... వుద్యోగమో" అని ప్రశ్నించాడు.

"ఆలోచించుకోండి" అన్నాడు ఆదిశేషు.

అంతా నీళ్ళుగారుకుంటూ యింటిముఖం పట్టారు. రంగయ్య నడుస్తూనే తన పెళ్లాం పిల్లలూ తిండిలేక చూడిపోతున్నట్లు కలగన్నాడు. అప్పుడే సింహం నోటిలోనుంచి, పెద్దపులి గుహలోనుంచి, ఎగురుతున్న విమానంలోనుంచి బయటపడిన వాడికిమల్లే ఉంది అతని వైఖరి....మనస్సే ప్రెస్సయి మోతపెడుతూ వుంది. పిల్ల లేడుస్తూన్నట్టూ, పెళ్ళాం తనను 'యీ బ్రతుకు బ్రతికేదానికన్నా ఎందులోనన్నా పడుచావకూడదూ' అంటున్నదనిపించింది.